# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ఇం (ఇదే) ధనం

" లేచారూ! ఒక్క రోజు కూడా మానకుండా వెళ్ళడానికి అదేమైనా ఉద్యోగమా?? హాయిగా పడుకోక ఎందుకండీ చలికాలంలో కూడా మీకీ కంచిగరుడ సేవ?" అంది కామాక్షి, మంచమ్మీద లేచి కూర్చున్న భర్త కామేశ్వరావు ని చూసి. ఆయన ఎప్పటిలాగే ఆవిడ వైపు చూసి ఒక చిరునవ్వు విసిరేసి మళ్ళీ తనపనిలో తాను పడ్డాడు.

" రోజూ రాత్రి ఇలా చేస్తూ ఉంటే, మీ ఆరోగ్యం ఏమవుతుంది?" అందావిడ కాస్త కోపంగా.

ఆయన స్వెటర్ వేసుకుంటున్నాడు.

" ఏదో పెద్ద డ్యూటీ పోలీసు లా తగుదునమ్మా ! అంటూ పదిగంటలకల్లా బయలుదేరుతారు." దెప్పింది ఆవిడ.

మెడకి మఫ్లర్ కట్టుకుని, అద్దంలో చూసుకుంటున్నారు ఆయన సరిగా అమరిందా, లేదా అని

" బాగానే ఉందిలెండి. నిద్రకో, బీ.పీకో ఎక్కడో పడిపోతే ఎంత గొడవ? అబ్బాయి చెప్పినా వినరు కదా!" అంది ఆవిడ.

కళ్ళ జోడు, కాలిజోడూ వేసుకుని తను అప్పటికే సర్ది పెట్టుకున్న బుట్ట పట్టుకుని బయలుదేరుతూ.

" నే వస్తాను కామాక్షీ, నువ్వు పడుకో, నా దగ్గర తాళం ఉంది కదా!" అన్నారు.

"హూ!" అంటూ నిట్టూర్చిందావిడ.

"ఎప్పుడూ మీరనుకున్నది చెయ్యడమే కానీ నేను చెప్పింది ఎప్పుడైనా విన్నారా? ఇప్పుడు వినడానికి. ఏదో, ఒకటి ఊరేగండి" అంది కోపంగా.

ఆయన ఆమెకేసి చూసి మళ్ళీ అదే చిరునవ్వుతో దుప్పటి కప్పి లైట్ ఆర్పేసి, " వస్తాను, మంచినీళ్ళ సీసా పక్కనే పెట్టాను దాహం వేస్తే తాగు" అన్నారు.

ఆవిడ కూడా చిరునవ్వి నవ్వింది ఆ మాటకి. "తొందరగా వచ్చేయండి" అంటూ

మెల్లిగా తలుపు తీసుకుని హాల్లోకి వచ్చారు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. కొడుకూ, కోడలూ, పిల్లలూ మిగతా రెండు బెడ్ రూముల్లో నిద్రపోతున్నారు. పొద్దున్న లేస్తూనే కాఫీలు, టిఫిన్లు, స్కూళ్ళూ, ఆఫీసులూ, నీళ్ళూ, పాలూ లాంటి మరోక నాటి తుఫానుకు ముందర ప్రశాంతత ఇంట్లో.

చేతిలో బాగ్ పట్టుకుని మెల్లిగా వీధి వాకిలి తీసి అడుగు బయట పెట్టారు. చలిగాలి రయ్యిన కొట్టింది ముఖాన. నెమ్మదిగా లిఫ్ట్ దాకా నడిచి కిందకి దిగారు.

వాచ్ మేన్ కూడా "నమస్తే సాబ్, ఈ రోజు చలి బాగా ఉంది కదా! పడుకోలేకపోయారా? అన్నాడు.

" పర్వాలేదులే బహాదుర్, తొందరలోనే వచ్చేస్తాగా!" అంటూ తన స్కూటర్ తీసి కిక్ కొట్టి స్టార్ట్ చేసి బయలుదేరారు.

అతనికి డెబ్బై ఏళ్ళవయసు. ఆ స్కూటర్ తో దాదాపు ముప్పై ఏళ్ళపైబడినఅనుబంధం. ఏనాటిదో బజాజ్ చేతక్. ఎంతమంది చెప్పినా అది మార్చలేదు ఈనాటివరకూ. అందరూ కలిసి వెళ్తే కొడుకు కార్లోనూ, తామిద్దరో లేదా తనొక్కడేనో వెళితే ఈ స్కూటర్ మీదా వెళ్ళడమే అలవాటు ఆయనకి.

చేతిలో ఉన్న బాగ్ ని జాగ్రత్తగా స్కూటర్ ముందు పెట్టుకుని నెమ్మదిగా నడుపుకుంటూ బయల్దేరారు. ఆయన వెళ్ళగానే గేటు వేసేసి లోపలకి వెళ్ళిపోయాడు వాచ్ మాన్ బహాదుర్. "పన్నెండింటికల్లా వచ్చేస్తాను, నిద్రపోవుగా ? " అన్న ఆయన మాటలు తలుచుకుంటూ.

రాష్ట్ర ప్రభుత్వోద్యోగి ఆయన పదవీవిరమణ చెయ్యకముందు. ఒక కొడుకు, కూతురు, కామాక్షీ తను, ఇద్దరో ముగ్గురో ముఖ్యమైన స్నేహితులూ, ఇదే ఆయన ప్రపంచం. పొద్దున్నే ఆఫీసుకు వెళ్ళడం, రావడం మిత్రులతోనో, కుటుంబంతోనో కాలక్షేపం. అంతకుమించి ఈ నాటి కొత్తరకాలు లేని ఆనాటి అందమైన ప్రపంచం అప్పట్లో వారిది. పొద్దున్న పేపర్ తో నిన్నటి వార్తలు తెలిస్తే, రేడియో ఆనాటి ముఖ్యమైన వార్తలు చెప్పేది. అలాగే ఆటల కామెంట్రీలూ, కొత్తా, పాతా పాటలూ వినిపించేది. పొద్దున్నే కామాక్షి వేసిన ముగ్గు గుమ్మంలో చీమలని పోషిస్తే, తాను ఆఫీసుకు వెళ్ళేముందు చేసే భోజనం లోని తొలిముద్ద తమ ఇంటి చుట్టూ తారాడే పక్షులకి అన్నం పెట్టేది.

ఎన్. టీ ఆర్ దో, ఏ. ఎన్ ఆర్ దో తెలుగు సినిమా, రాజ్ కపూర్ దో, రాజేష్ ఖన్నాదో హిందీ సినిమా, మెకన్నాస్ గోల్డ్, బెన్ హర్ లాంటి ఇంగ్లీష్ సినిమా కుటుంబానికి సరదా కాలక్షేపం. మాలతీ చందూర్ గారి పుస్తకాల్లాంటివి చూసి అప్పుడప్పుడూ స్పెషల్ వంటలు చేసేది కామాక్షి. అలా మూడు నాలుగు నెలలకొకసారి ఎప్పుడైనా బిర్యానీ చేస్తే ఇంటిల్లిపాదీ రెండుపూటలూ అదే తినేవారు. ఏడాదికో, రెండేళ్ళకో ఏదో ఒక పుణ్యక్షేత్రమో, మరేదైనా ప్రదేశమో విహార యాత్ర. పుట్టినరోజులకీ, పెళ్ళిరోజుకీ హోటల్లో భోజనం. ఇలా ఎంతో ఆహ్లాదంగా, ఆనందంగా ఉండేది ఆయనకి జీవితం. పిల్లల ఆటపాటలలోనూ, చదువులలోనూ ఇన్నేళ్ళూ ఎలా గడిచిపోయిందో తెలియలేదు. ఇప్పుడేమో పిల్లలిద్దరూ స్థిరపడి సుఖంగా ఉన్నారు.

నెమ్మదిగా స్కూటర్ నడుపుతూ తను అనుకున్న చోటుకి రాగానే ఆపి స్టాండ్ వేసి పక్కనే ఉన్న బస్ స్టాప్ లోకి నడిచారు.

"నమస్తే సాబ్" పలకరించాడు పక్కనే టీ కొట్టు మజీద్.

"నమస్తే మజీద్, నువ్వు నాకన్నా ముందు వచ్చేశావే ఈ రోజు. ఎలా ఉంది ధంధా?" అన్నారు నవ్వుతూ.

" నా మాటలు మీరు మాట్లాడుతున్నరా సార్? పరవాలేదు" అన్నాడు కొత్త పాల పాకెట్ కట్ చేసి పాల గిన్నెలో వేస్తూ.. తెల్లగా పొడుగ్గా ఉంటాడు మజీద్. గత మూడేళ్ళగా టీ కొట్టు నడుపుతున్నాడు. అల్లం, ఏలక్కాయ వేసి అతను పెట్టే టీ అంటే ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో బాగా పేరు.

" నేను ఇక్కడే కూర్చుంటాను ఈ రోజు, బస్ స్టాపులో వద్దులే" అన్నారు అక్కడున్న స్టూల్ లాక్కుంటూ.

" చాయ్ ఇచ్చేదా సాబ్?" అన్నాడు మజీద్

" అప్పుడే వద్దులే, ఇప్పుడేగా వచ్చాను. ఇంకో గంట పోనీ" అన్నారు. ఇద్దరూ ఏవో కబుర్లలో పడ్డారు. అరగంట గడిచింది.

"మీరుండబట్టి నేను రాత్రి కూడా రెండు గంటలు నడుపుతున్నాను. లేకుంటే ఎనిమిది గంటలకే దుకాణం బంద్ గదా! " అన్నాడు మజీద్.

" ఈ రోజు ఎవరూ రాలేదు ఇప్పటివరకూ" అన్నారాయన టైము చూసుకుంటూ..

"వస్తార్లే సార్, రాకుంటే నీకు మంచిదే కదా! డబ్బులు మిగులుతాయి" అన్నాడు నవ్వుతూ.

అతనలా అంటూ ఉండగానే ఒక బైక్ మీద ఇద్దరు అబ్బాయిలు తోసుకుంటూ వచ్చారు.

" అరే భాయ్, నజ్దీక్ లో పెట్రోల్ పంపున్నదా?" అన్నాడు తోస్తున్న అబ్బాయి పక్కనున్న పొడవాటి కుర్రాడు. తోసుకుంటూ వచ్చినందుకు ఇద్దరూ ఆయసపడుతున్నారు.

"పెట్రోల్ పంప్ లేదన్నా! కానీ పెట్రోలున్నది. ఒక క్షణమాగున్రి" అన్నాడు మజీద్.

"అదేందిభయ్యా తమాష చేస్తున్నావా? సరేగానీ, రెండు చాయియ్యి ముందు" అన్నాడు ఆ అబ్బాయి.

"లే అన్నా, ఇగో ఈ సార్ తానున్నది పెట్రోల్" అన్నాడు మజీద్ ఇద్దరికీ చాయ్ ఇస్తూ..

" సార్ దగ్గరా? ఓ సరే! సార్ ఇక్కడ దగ్గరలో ఎక్కడా పెట్రోల్ పంప్ లేదు. దాదాపు రెండు కిలోమీటర్ల నించీ తోసుకుని వస్తున్నాము. కొద్దిగా పెట్రోల్ ఉంటే ఇవ్వండి. మొదటి పెట్రోల్ పంప్ కనపడగానే వేయించేసుకుంటాం. మీ బండిలోదిస్తారా? అన్నాడు తోస్తున్న అబ్బాయి.

ఇలాంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నటూగా ఆయన "ఒక్క క్షణం బాబూ!" అని పక్కనున్న తన బాగ్ తీసి అందులోంచి ఒక పాత బట్టా, చిన్న గరాటు, అరలీటర్ సీసాలో ఉన్న పెట్రోల్ బయటకి తీసారు.

వాళ్ళిద్దరూ టీ తాగగానే, ఆయన వాళ్ళ బైక్ దగ్గరకి వెళ్ళి పెట్రోల్ టాంక్ మూత తీసి ఎంతో జాగ్రత్తగా తన చేతిలో ఉన్న పెట్రోల్ అందులో పోసి, మళ్ళీ మూత బిగించి, చుట్టూ పడిన చుక్కలని, టాంకుమీదున్న ఉన్న దుమ్మునీ తన చేతిలోని బట్టతో తుడిచి వచ్చారు.

" చాలా ప్రొఫెషనల్ లెక్కున్నాడు అంకుల్" అన్నాడు మొదటబ్బాయి, ఆయన చేతికున్న గ్లవుస్ వైపు చూస్తూనే. రెండో అబ్బాయి ఏమనుకున్నాడో ఏమో" ష్" అన్నాడు తన స్నేహితుడివైపు చూస్తూ..

" మీ బండి రెడీ! మీరు హాయిగా వెళ్ళచ్చు. రేపొద్దున్నే పోయించుకోండి. అన్నారు నవ్వుతూ..

" థాంక్ యూ సార్, మీకు?" అంటూ పర్స్ తీసాడు మొదటి అబ్బాయి.

" డబ్బులా? భలేవాడివే! నువ్వు డబ్బులివ్వాల్సింది మజీద్ చాయ్ కి" అంతే అన్నారు మళ్ళీ అదే నవ్వుతో.

"అదేమిటి సార్? ఊరికే ఎందుకు? పరవాలేదు తీసుకోండి " అన్నాడు ఆ అబ్బాయి మొహమాటంగా. "నిజంగానా? ఆర్ యూ స్యూర్?" అన్నాడా రెండో అబ్బాయి.

" ఇది నా వ్యాపారం కాదయ్యా, రోజులో నాకున్న ఇరవైనాలుగు గంటల్లో ఓ రెండు గంటలు మాత్రం ఈ పని చేస్తాను. అంతే కానీ నేను ప్రొఫెషనల్ ని కాదు" అన్నారు నవ్వుతూ.

తానన్న మాట ఆయన విన్నారని అర్థమయిన ఆ రెండో అబ్బాయి నాలిక్కరుచుకున్నాడు.

" పదకొండు దాటుతోంది, మీ ఇంట్లో ఎదురుచూస్తూ ఉంటారు, తొందరగా బయలుదేరండి" అన్నారు ఆయన.

"మూడు సంవత్సరాలుగా సూత్తున్నా సార్ను. ఎప్పుడూ ఎవరితానా ఒక్క పైసా భీ తీసుకోడు. కావలిసినోల్లు రావాలే గానీరోజూ మూడు లీటర్ల పెట్రోల్ ఇలా ఊరికే ఇస్తాడు" అన్నాడు మజీద్.

ఆ మాటలతో మరి ఇంకేమీ అనకుండా ఆయనకి ధన్యవాదాలు చెప్పి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

" ఖుషీ అయినదా సార్, వచ్చిను కదా ఒకరు" అన్నాడు మజీద్ నవ్వుతూ.

" ఇంకా ఐదు సీసాలున్నాయి, పన్నెండులోపల ఎవరైనా వస్తారో రారో?" అన్నారాయన తనలో తానే అనుకుంటు న్నట్టుగా.

ఆయన అలా మాట్లాడుతూ ఉండగానే ఒక మధ్యవయసు దంపతులు తమ హోండా యాక్టివా స్కూటర్ ని తోసుకుంటూ వచ్చారు. ఆవిడ పక్కన నడుస్తూనే ఆయన్ని సాధిస్తోంది.

" ఎప్పుడూ ఇంతే మీరు! ఓ రోజు ముందు చూసుకుంటే పోదా? ఇప్పుడింకా ఎంత దూరం నడవాలో ఏమిటో? ఆయాసం వస్తోంది నడిచి నడిచి" అంటూ.

" నువ్వుండవే బాబూ, నీ శరీరాన్ని మోసుకోవడమే నీకు కష్టం గా ఉంటే ఈ స్కూటర్ ని కూడా తోస్తున్నాను, నా మాటేవిటి? అయినా రోజూ పొద్దున్నే లేచి వాకింగ్ కి వెళ్ళమంటే ఏదో ఒక వంక పెట్టి ముసుగు పెడతావు తప్ప నిద్ర లేవవు కదా! లేచి నడిస్తే ఇంత శ్రమ ఉండదు కదా" అంటున్నాడాయన.

" సర్లేండి, ఇప్పుడు నా వాకింగ్ గురించిన చర్చ ముఖ్యం కాదు, ముందు స్కూటర్లోకి పెట్రోల్ ఎలా వస్తుందో? ఆ సంగతి ఆలోచించండి, " ఎద్దేవాగా అంటూనే,

" ఇంక నడవడం నా వల్ల కాదు, ఇదిగో ఆ బస్ స్టాప్ లో కూర్చుంటాను, పెట్రోల్ తిప్పలేవో మీరే పడండి" అంది.

మజీద్ ని టీ కొట్టునీ చూస్తూనే " హమ్మయ్య! ఓ టీ ఇవ్వు నాయనా, గొంతు ఆరిపోయింది" అందావిడ వగరుస్తూ..

" నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు, కనీసం టీ అయినా నాకు కూడా చెప్పవా? బంక్ దాకా వెళ్ళమన్నావు, అసలెక్కడుందో? వెళ్ళినా అది తెరిచి ఉంటుందో లేదో? నా దగ్గర ఒక్క ఖాళీ సీసా కూడా లేదు. " తనలో తనే అనుక్కుంటున్నట్టుగా అంటూ " అందుకే ఓ గంట ముందే బయలుదేరుదాం అన్నాను, నువ్వే మా అక్కని కలిసి నెలయింది, మా పిన్ని చూసి చాన్నాళ్ళయింది అంటూ కబుర్లేసుకుంటూ తిష్ట వేశావు, ఇప్పుడు చూడు " అన్నాడాయన.

" ఈయనకూడా ఓ టీ ఇవ్వు నాయనా, "అని మజీద్ తో అంటూనే, " మనం ఈ వూరి చివర ఇల్లు కొనుక్కున్నాకా మా వాళ్ళనిదివరకు లా కలవలేకపోతున్నాను కదా అని ఓ గంట ఉందామన్నాను, అదీ తప్పేనా? అయినా మీరు పెట్రోల్ పోయించుకోకుండా నన్నంటారేం? "అని ఎదురుదాడికి దిగిందావిడ.

" టీ తీసుకోండి" అంటూ ఇద్దరికీ చెరో గ్లాస్ ఇచ్చి కామేశ్వర్రావు వైపు చూసి నవ్వాడు. వారి సంభాషణని నవ్వుతూ వింటున్న ఆయన కూడా లేచి వారిదగ్గరకొచ్చి

" ఇంత రాత్రి వేళ మీరిబ్బంది పడద్దు కానీ, టీ తాగి మీ పెట్రోల్ టాంక్ తెరవండి " అంటూ తన బాగ్ లోంచి మరొక సీసా, గళ్ళా తీసి జాగ్రత్తగా పెట్రోల్ పోసి మళ్ళీ పాత బట్టతో తుడిచి సీటుని మూసేశారు. ఆయనా పని చేస్తుంటే ఇద్దరూ ఆశ్చర్యంగా చూశారు.

" ఇదేదో కొత్త బిజినెస్సేమోనండోయ్, ఒకరు టీ, మరొకరు పెట్రోల్" అందావిడ రహస్యంగా భర్తతో.

'అవునూ, కాదూ' లకి మధ్యస్థంగా తల ఊపాడు ఆయన. ఎంతో హుందాగా పెద్దమనిషిలా కనిపిస్తున్న ఆ పెద్దాయన్ని చూస్తే అతను బంకులదగ్గరనుంచి పెట్రోల్ కొనుక్కొచ్చి ఇలా అవసరమున్న వారికి పెట్రోల్ సాయం చేసి ప్రతిఫలంగా లీటరుకు ఐదో, ఆరో అడిగే రకంగా కనిపించలేదు. అలా అని ఊరికే ఇస్తారని అనుకోవడానికి నమ్మకం కుదరడం లేదు, అసలే పెట్రోల్ ధరలు భగ భగా మండుతున్న ఈ రోజుల్లో. ఏమనాలో తోచనట్టు అలాగే నిల్చుండి పోయాడు.

" అలాగే నిల్చున్నారేం, టీ అతనితో పాటు ఆ పెద్దాయనకి కూడా డబ్బులిచ్చేయండి, నిద్ర వస్తోంది" అందావిడ ఆవులిస్తూ.

అప్పటికే కామేశ్వర్రావు మజీద్ దగ్గరకి వెళ్ళి స్టూల్ మీద కూర్చున్నా రు తను కూడా టీ తాగుతూ.

" మీ డబ్బులు" అన్నాడు నసుగుతూ వచ్చినాయన

" వద్దండి, నేను డబ్బులు తీసుకుని ఇవ్వను, బాగా అవసరం అనుకున్నవారికి ఉచితంగా ఇస్తాను, ఇదేమీ నా బిజినెస్ కాదు" అన్నారాయన ప్రతిగా.

" అర్థమయిందండి మిమ్మల్ని చూస్తూనే, అర్థం కానిదొక్కటే ఎందుకీ రాత్రివేళ పనిగట్టుకుని ఇలాంటి సహాయం చేస్తున్నారు? " అన్నాడాయన.

"సహాయం చెయ్యడానికి పనిగట్టుకోవడం ఏముంటుందండీ? రిటైరయిన నాటినించీ ఎదైనా చెయ్యాలని తాపత్రయం. కొడుకూ, కోడలూ ఉద్యోగాలకి వెళ్ళే ఇల్లు, పొద్దున్న పూట మనవల ఆలనా, పాలనల్లో టైము గడిచిపోతుంది. అందుకని రాత్రి వేళ ఏదో నాకు తోచినది" అన్నారాయన.

" అవుననుకోండి, ఏదో మంచినీళ్ళిచ్చినట్టు ఇలా పెట్రోల్ దానమా? అదీ రోజూనా? "అన్నాడాయన.

నవ్వారు కామేశ్వరరావు. " నాకూ మీ లాంటి అనుభవాలే లెండి వాటిల్లోంచి వచ్చిన ఆలోచనే ఇది. బాగా పొద్దుపోయింది, పాపం ఆవిడ అలిసిపోయారు. వెళ్ళి రండి, మరోసారి మీకు పెట్రోల్ అవసరం పడితే అప్పుడు చెప్పుకుందాం ఈ కబుర్లు అన్నారు" నవ్వుతూ.

" కారణమేదైనా ఈ రాత్రి మీరు చేసిన సహాయం మర్చిపోలేను, ప్రతిఫలంగా ఏమీ వద్దంటున్నారు, అదే మొహమాటంగా ఉంది" అన్నాడాయన.

" సినిమా స్టైల్లో చెప్తున్నాననుకోపోతే మీరు ఎప్పుడైనా ఒకరికి మీరు తీసుకున్న సహాయాన్నందించండి చాలు" అన్నారు కామేశ్వరరావు.

అలా ఆయనకి ధన్యవాదాలు చెప్పి ఆ దంపతులిద్దరూ బయలుదేరారు.

" పన్నెండవడానికింకో పావుగంటుంది, ఈ రోజుకింతే! అనుకోవాలి మజీద్. నీ చాయ్ లు బానే జోరుగా పోయాయి కదూ" అన్నారాయన.

" ఔ సార్, చాయ్ లదేముంది, వచ్చే పోయేవారికెవరికైనా చా బడ్డీ కనిపిస్తే తాగబుద్ధవుతుంది కదా" అన్నాడు, మెల్లిగా షాపు మూసెయ్యడానికుపక్రమిస్తూ.

" నా చాయిలకదిసిపెట్టండి, మీ పెట్రోల్ కదేంటి?ఈ రోజు నాకు పూరా సెప్పండి. ఎప్పుడడిగినా దాటేస్తారు. " అన్నాడు

" అందులో ఏముందిలే? మజీద్, మాములు కథే!" అన్నారాయన.

" ఇలాగే ఒకరాత్రి నేనూ నా భార్య సెకండ్ షో సినిమా చూసి వస్తున్నాము. మేము సినిమాలకి వెళ్ళేది తక్కువే అయినా అది మంచి హిందీ సినిమా అని వెళ్ళాము. అన్నీ ఎంతో పద్ధ్వతిగా చేసే నేను పెట్రోల్ విషయం వచ్చేసరికి ఎందుకో అశ్రద్ధ చేసేవాడిని. అలా మూడు నాలుగు సార్లు ఇబ్బంది పడ్డాను, అలాంటిదే అయ్యింది ఆ రోజు.. చిన్నగా జల్లు పడుతోంది. చీర తల మీద కప్పుకుని నా పక్కనే నా భార్య కామాక్షి నడుస్తోంది. నేను నా స్కూటర్, ఇదిగో ఇదే తోసుకుంటూ నడుస్తున్నాను. కనుచూపు మేరలో బంక్ లేక ఆ రాత్రి దాదాపు మూడు కిలోమీటర్లు నడిచాము. అదృష్టవశాత్తూ వర్షం పెద్దదవలేదు. కొంచం మోకాళ్ళ నెప్పులున్న కామాక్షి పాపం ఆ చలిలో, చిన్న వర్షంలో నడిచిన నడకకి మూడు రోజులు పడకేసింది. ఐతే ఇందాకటి ఆవిడలా కాదు, నా అశ్రద్ధ తెలిసి కూడా నన్ను ఒక్క మాట అన లేదు అనుకో! " అన్నారు.

"అడిగావు కదా అని చెబుతున్నాను, రెండో సారి మా అబ్బాయి ని పరీక్షకి తీసుకెళ్ళాలి, ఆ రోజెందుకో పెట్రోల్ బంకులు, ఆటోలు బంద్. ఇంటిదగ్గర బయలుదేరినపుడే నాకనుమానం వచ్చినా, బంద్ కారణంగా మరో దారిలేక "సరిపోతుందిలే' అని నాకు నేనే ధైర్యం చెప్పుకుని బయలుదేరాము. మధ్య దారిలో మామూలే, పెట్రోల్ అయిపోయింది. వాడు చూస్తే పరీక్షకెళ్ళాకి, ఎక్కడా ఒక్క బంకు తెరిచి లేదు. ఆరోజు నేను పడినంత కంగారు బహుశా ఎప్పుడూ పడి ఉండను. ఇంతలో మా అవస్థ చూసిన ఒక స్కూటరతను పాపం తన బండి ఆపి, చిన్న పైపుతో నోటిలోకి పెట్రోల్ పీల్చి, తనదగ్గరున్న చిన్న సీసాలో పోసి మరీ నాకిచ్చాడు. దానివల్లే మేము సరి అయిన టైముకి పరీక్ష హాలుకి చేరగలిగాము. ఎప్పుడూ లేనిది, ఆరోజున మాత్రం కామాక్షి నన్ను కేకలేసింది.

" ఆటోలు, పెట్రోల్ బంకులూ బంద్ ఉన్న వేళ కూడా చూసుకోరా? ఆలస్యమైతే పిల్లాడి పరీక్ష ఏమయ్యేది? ఏడాదిపాటు చదివిన చదువు" అంటూ..

అప్పటినించీ, ఇప్పటివరకూ ఎప్పుడూ పెట్రోల్ విషయంలో అశ్రద్ధ చూపలేదు నేను. అందుకే నలుగురికీ ఎద్దైనా పనికి వచ్చే పని చెయ్యాలని అనుకున్నప్పుడు నాకొచ్చిన మొదటి ఆలోచన ఇదే.

ఎన్నో కారణాల వల్ల మధ్యలో పెట్రోల్ అయిపోవడం, నాలాంటివారు ఇబ్బంది పడడం నాకు తెలుసు. అదీకాక, ఊరికి కాస్త దూరంగా ఉన్న కాలనీలు మావి, ఇక్కడ ఇంకా అన్ని సౌకర్యాలు లేవు. అదీ ఒక కారణం. పగలైతే ఎలాగోలా పని కానిచ్చుకోవచ్చు, ఆటోలో

వెళ్ళో, ఎవరినైనా సహాయం అడిగో. అదే రాత్రివేళైతే ఎంత కష్టం? అందుకే రాత్రి పూట ఎంచుకున్నాను. మనవలుండడం కూడ ఒక కారణం అనుకో. పెరిగే వయసుతో తరిగే నిద్ర వరంగా ఇచ్చిన కాస్త ఎక్కువ సమయాన్ని ఇలా వినియోగించాలని నిర్ణయించుకున్నాను.

కామాక్షి రోజూ తిడుతూనే ఉంటుంది, ఆవిడ బాధంతా ఆ ఆరోగ్యం గురించే అనుకో. డబ్బు గురించి కాదు పాపం. నా కొచ్చే పెన్షన్ లోంచి ఖర్చు పెడతాను. అయినా ఇదేం పెద్ద ఖర్చు కాదులే! దేవుడిచ్చినంతవరకూ మా పరిస్థితి బావుంది కదా! మన పేరున నలుగురు ఇబ్బంది పడకుండా ఉంటే ఎంతో సంతోషం కదూ! అన్నింటికంటే ముఖ్యం"

" రోజూ ఎనిమిదింటికి దుకాణం బంద్ చేసి ఎల్లిపోయేటోడ్ని, మీరొచ్చినాక భోజనం చేసి మళ్ళీ రెండు గంటలు ధందా చేసుకుంటున్నా, తమ్ముడి సదువుకి పనికొస్తోంది" అంటావు కదా, అది ఇంకా సంతోషమో చెప్పు! ఇంతకంటే సంపదలున్నాయా? ఇదే ధనం కదూ, ఇంధనం ఇస్తున్న ధనం.. పన్నెండవుతోంది, ఈ రోజుకి మన డ్యూటీ అయిపోయింది. బయలుదేరదాం పద.." అంటూ లేచారు. వెనకే టీ కొట్టు తాళం వేసి మజీద్ కదిలాడు.

●●●

Click here to share your comments on this story